సాక్షి జగిత్యాల

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



ఆయుష్మాన్‌భవ హెల్త్ మేళా

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఆయుష్మాన్ భవ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ మేళాను మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ప్రారంభించారు.



జగిత్యాలలో వర్షం

జగిత్యాల: జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం

32.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీకి 11,818 క్యూసెక్కుల ఇన్ ఫ్లో



ఎస్సారెస్పీ వరద కాల్వ ద్వారా జిల్లాకు వస్తున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు నీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు శుక్రవారం సాయంత్రం 3 గంటల వరకు 11,818 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం ఎస్సారెస్పీ పూర్తి స్థాయిలో నిండటంతో ప్రాజెక్టులోకి వస్తున్న నీటిలో కాకతీయ మెయిన్ కాలువకు 5,500 క్యూసెక్కులు, వరద కాల్వకు 5 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఇఫ్కో సమావేశంలో సింగిల్ విండోల చైర్మన్లు



ఢిల్లీలో సింగిల్‌విండోల చైర్మన్లు

రాయికల్(జగిత్యాల): ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఇఫ్కో సర్వసభ్య సమావేశానికి రాయికల్ సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, చొప్పదండి చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, గట్టుదుద్దెనపల్లి చైర్మన్ రాధాకిషన్‌రావు, పొరండ్ల చైర్మన్ స్వామిరెడ్డి హాజరయ్యారు. ఇఫ్కో చైర్మన్ దీప్‌కుమార్, ఎండీ ఉదయ్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావులతో కలిసి సహకార సంఘాల అభివృద్ధిపై చర్చించారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీధర్

పెగడపల్లి(ధర్మపురి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిష్టర్, ఓపీ, మందుల స్టాక్, ఇమ్యూనైజేషన్ రిజిష్టరులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు, శిశువులకు షెడ్యూల్ ప్రకారం అవసరమైన టీకాలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. చిన్న పిల్లల రక్షణకు టీకాలను ప్రతి బుధ, శనివారం క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం అందించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రజలను అప్రమత్తం చేసి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు నరేశ్, రమ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, జయశీల, తార, ఫార్మసిస్ట్ భాస్కర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

మల్యాల(చొప్పదండి): కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవనం యూనివర్సిటీకి అనుబంధంగా జిల్లాకు కేటాయించిన కృషి విజ్ఞాన్ కేంద్రం ఏర్పాటుకు యూనివర్సిటీ అధికారులు శుక్రవారం మల్యాలను సందర్శించారు. మండల కేంద్రంలోని మల్లెగుట్ట సమీపంలో సుమారు 300 ఎకరాల మేర ప్రభుత్వ స్థలం ఉందని, స్థానిక అధికారులు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కృషి విజ్ఞాన్ కేంద్రం ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం అవసరమవుతుందని, ఈ మేరకు స్థల పరిశీలన చేశారు. స్థానికంగా ఉద్యాన వన పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తే పరిసర ప్రాంతాల్లో ఉద్యానవన సాగు పెరుగుతుందని, ప్రభుత్వ భూమిలో పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో మల్యాల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, ఆర్‌ఐ తిరుపతి, సర్వేయర్ మధుకర్, కార్యదర్శి దాసరి రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు సిద్ధం



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ప్రారంభానికి ఏర్పాట్లు
- అక్టోబర్ 3న పంపిణీ చేయనున్న మంత్రి కేటీఆర్
- నెరవేరనున్న పేదల సొంతింటి కల

జగిత్యాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపడతామని చెప్పిన పాలకులు ఆ మేరకు ప్రతీ నియోజకవర్గంలో ఇళ్లను మంజూరు చేశారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో జగిత్యాల నియోజకవర్గానికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత సహకారంతో 4,520 ఇళ్లను మంజూరు చేయించారు. నూకపల్లి శివారులో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 520 ఇళ్లు పూర్తయ్యాయి. 2 వేల ఇళ్లకు సంబంధించి సెప్టిక్ ట్యాంకులు, డ్రెయినేజీలు పూర్తి కావాల్సి ఉంది. మరో 2 వేల ఇళ్లకు ఎలక్ట్రిసిటీ, వాటర్‌సప్లై కావాల్సి ఉండగా, పనులు శరవేగంగా చేస్తున్నారు. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 3,722 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిసింది. మరో విడతలో పూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వనున్నారు.

జాబితా సిద్ధం

అక్టోబర్ 3న మంత్రి కేటీఆర్ జగిత్యాలకు రానున్న నేపథ్యంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించేలా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశారు. మొదట 3,722 మందికి ఇళ్లను అందజేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ బాషా పలుమార్లు డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శించి శరవేగంగా పనులను పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు.

పారదర్శకంగా ఎంపిక

పేదవారికి ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కట్టిస్తామని చెప్పి గత ఎన్నికల్లో హామీ ఇచ్చింది. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని నూకపల్లి శివారులో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పనులు తుది దశకు చేరాయి. అధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశారు. జగిత్యాలకు చెందిన వారికే ఇళ్లను అందజేయనున్నారు. ఒక జగిత్యాల మున్సిపాలిటీకే 4,520 డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నూకపల్లి శివారులో 140 ఎకరాల స్థలం కేటాయించడంతో గేటెడ్ కమ్యూనిటీ నిర్మించారు. ఈనేపథ్యంలో పేదవారి సొంతింటి కల నెరవేరనుంది.

అర్హులకే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

జగిత్యాల: అర్హులకే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. అక్టోబర్ 3న మంత్రి కేటీఆర్ రానున్న నేపథ్యంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. రిజర్వేషన్ ప్రకారం ఇళ్ల పంపిణీ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, ఆందోళన చెందొద్దని అర్హులందరికీ వస్తాయన్నారు. ఇంకా అర్హులుంటే రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తామని, ఎంపిక పారదర్శకంగా చేస్తామని చెప్పారు. ఆయన వెంట ఈఈ రెహమాన్, డీఈలు మిలింద్, రాజేశ్వర్ ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లల స్వరూపం

ప్రాజెక్ట్ వ్యయం	రూ.280 కోట్లు
కేటాయించిన స్థలం	140 ఎకరాలు
జగిత్యాల మున్సిపాలిటీలో..	4,520
పూర్తయిన ఇళ్లు	520
ఎలక్ట్రిసిటీ, వాటర్ సప్లై కావాల్సినవి	2,000
సెప్టిక్‌ట్యాంక్‌లు, డ్రెయినేజిలు నిర్మించాల్సినవి	2,000
మొదటి విడతలో అందజేసేవి	3,722 (సుమారు)

పరిరక్షించకుంటే.. పరులపాలే!

- 'రంగనాయకుల స్వామి' భూములు అన్యాక్రాంతం
- పట్టాలు చేసుకున్న అక్రమార్కులు
- ధూపదీపాలకు నోచుకోని స్వామివారు
- పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు
- మసకబారుతున్న 150 ఏళ్ల ఆలయ ప్రభ

సాక్షి పరిశోధన



పెద్దపల్లి మండలం ముత్తారంలోని రంగనాయకుల స్వామి ఆలయం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కష్టమొస్తే దేవుడికి మొక్కుకుంటాం. కానీ, ఆ దేవుడికే కష్టమొచ్చింది. తన భూములు పరులపాలవుతుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి పెద్దపల్లి జిల్లాలోని రంగనాయకుల స్వామివారికి ఎదురవుతోంది. ఆలయ భూముల పరిరక్షణలో అధికార యంత్రాంగం ఉదాసీనత.. చట్టాల్లోలొసుగులు అక్రమార్కులకు వరంగా మారాయి. ఫలితంగా 150 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఆలయ ప్రభ భూ ఆక్రమణల కారణంగా మసకబారుతోంది. ఇప్పటికే వందల ఎకరాలు ఇతరుల చేతుల్లోకి వెళ్లినా.. సంబంధింత అధికారులు పట్టించుకోవడం లేదు. దేవాదాయశాఖలో భూరికార్డుల నిర్వహణ ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. దీంతో ఆయా భూములను ఇతరులు సాగు చేసుకుంటున్నారు. అందులో రాజకీయ పలుకుబడి ఉన్న నేతలు పట్టా పాసుపుస్తకాలు పొంది, రైతుబంధు సైతం తీసుకుంటున్నారు. దీంతో ఆయా భూముల పరిరక్షణ కోసం హైందవ సంస్థలు పోరాడుతున్నాయి. సిబ్బంది కొరతకు తోడు రెవెన్యూ యంత్రాంగంతో సమన్వయ లోపం కూడా సమస్యకు కారణమవుతోంది.

85 ఆలయాల పరిధిలో 1,089 ఎకరాలు

పెద్దపల్లి జిల్లాలో 85 ఆలయాల పరిధిలో 1,089.34 ఎకరాలుండగా, వీటిలో దాదాపు 20 శాతం భూములు ఆక్రమణలో ఉన్నట్లు సమాచారం. దేవాదాయ భూములకు సంబంధించి ఎక్కడిక్కడ హెచ్చరికలతో కూడిన బోర్డులు లేకపోవడంతోపాటు వందల సంవత్సరాల కిందటి భూములవడంతో కాలక్రమేణా వాటి ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

462.33 ఎకరాలు అన్యాక్రాంతం

పెద్దపల్లి మండలంలోని పాలితం, భోంపల్లి, కనగర్తి, కాసులపల్లి, ధర్మాబాద్ గ్రామాల్లో 462.33 ఎకరాల రంగనాయకుల స్వామి భూములున్నాయి. 1950కు ముందు అవి దేవుని భూములుగా రికార్డుల్లో నమోదయ్యాయి. సదరు భూముల్లో రైతుల పేర్లు తొలగించి, శ్రీ రంగనాయకుల స్వామి ఇనాం పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్ జారీ చేయాలని, 1బీ రిజిస్టర్‌లో కూడా నమోదు చేయాలని లేఖ నంబర్ బీ2/3715/2013 ద్వారా 26-11-2013న అప్పటి ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆలయ భూములను కొందరు తమ పేరిట మార్చుకోవడంపై అప్పటి ప్రభుత్వం సీరియస్ అయింది. ఏయే సర్వే నంబర్లలో ఎవరెవరు అక్రమమార్గంలో ఎంత భూమిని అనుభవిస్తున్నారో అప్పటి అధికారులు జాబితా రూపొందించారు. వెంటనే వారి పేర్లు తొలగించి, శ్రీ రంగనాయకుల స్వామి ఆలయం పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్స్ ఇవ్వాలన్న అప్పటి సర్కారు ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. కొందరు రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఆ భూముల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. దీనిపై అధికారులు అప్పట్లోనే నివేదిక సమర్పించారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేదు

ఆలయాల భూముల లెక్క తేల్చడానికి దేవాదాయ శాఖ గతంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. దేవుడి పేరిట భూములను దానం చేస్తే వాటి వివరాలను 43 రిజిష్టర్‌లో నమోదు చేసింది. వాటిలో ఎంతమేర భూమి కబ్జా అయ్యింది? ఎవరి ఆధీనంలో ఉంది? ఇనాం, కౌలు దారులున్నారా? తదితర అంశాలపై సమాచారం సేకరించింది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం, మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ శాఖల మధ్య సమన్వయలోపంతో భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫలితంగా ఆస్తులున్నా ఆదాయం లేక ఆలయాలు నిర్వహణ అగమ్యగోచరంగా మారిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయాల భూములను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనర్హులను ఎంపిక చేస్తారా

- చిన్నాపూర్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల రభస
- గ్రామసభ బహిష్కరణ

బుగ్గారం(ధర్మపురి): బుగ్గారం మండలం చిన్నాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో రభస చోటు చేసుకుంది. గ్రామంలో 39 ఇళ్లు నిర్మించారు. ఇందు కోసం మొత్తం 119 మంది దరఖాస్తు చేసుకోగా 28 మందిని అర్హులుగా ఎంపిక చేసిన అధికారులు అట్టి జాబితాతో శుక్రవారం సర్పంచ్ దమ్మ లతాశ్రీ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. బుగ్గారం మాజీ తహసీల్దార్ ఫారుఖ్ (ప్రస్తుతం పెగడపల్లి తహసీల్దార్), ప్రస్తుత తహసీల్దార్ మాజిద్, అధికారులు సభలో పాల్గొన్నారు.

గ్రామస్తుల అభ్యంతరం

గ్రామసభలో లబ్ధిదారుల పేర్లను అధికారులు ప్రకటించగానే పలువురు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు ఎంపిక చేసిన జాబితాలో పలువురికి ఇళ్లు ఉన్నాయని, నిరుపేదలు, ఇళ్లు లేనివారిని విస్మరించి అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారని మండిపడ్డారు.



అధికారులతో గ్రామస్తుల వాగ్వాదం

అర్హులకు ఎందుకు కేటాయించలేదని అధికారులను నిలదీశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో పలువురికి ఇళ్లు ఉన్నట్లు రికార్డుల్లో నమోదైందని, అందుకే వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేదని సమాధానమిచ్చారు. ప్రస్తుతం 28 మందితో మాత్రమే జాబితా తయారు చేశామని, అర్హులకు కేటాయించే విషయంపై మలివిడత జాబితాలో పరిశీలిస్తామన్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు జోక్యం చేసుకుంటూ అనర్హులను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించాలని, అర్హులందరినీ ఎంపిక చేసి ఒకేసారి ఇళ్లు కేటాయించాలన్నారు. అప్పటి వరకు ఎవరికీ ఇళ్లను ఇవ్వొద్దని, గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం కరువు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వలేదని నాయకుడు దమ్మ నర్సింగం అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా సాంకేతిక కారణాలతో అర్హత కోల్పోయిన పలువురు గ్రామస్తులను లబ్ధిదారుల జాబితాలో చేర్చాలని సర్పంచ్ గతంలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం. అంతేకాకుండా తాము సూచించిన నిరుపేదలను జాబితాలో చేర్చిన తర్వాతే పూర్తి లబ్ధిదారుల జాబితాను ప్రకటించాలని గతంలోనే ఆమె కలెక్టర్‌ను కోరారు.

జాబితాలో నాపేరు లేదు



నేను పూర్తి వికలాంగుడిని. నాన్న లేదు. అమ్మ కూలీ పని చేసి నన్ను పోషిస్తుంది. మాకు ఉండడానికి ఇల్లు లేదు. కొంతమంది గ్రామ పెద్దల స హకారంతో షెడ్డులో ఉంటున్నాం. నాకు కచ్చితంగా డబుల్ బెడ్‌రూం ఇల్లు వస్తుందని చాలా మంది పెద్దలు, అధికారులు చెప్పారు. తీరా చూస్తే జాబితాలో నాపేరు లేదు.

– గద్దం ప్రవీణ్, చిన్నాపూర్

అర్హులకు దక్కలేదు



ఇళ్ల కేటాయింపులో అర్హులకు చోటు దక్కలేదు. నా కొడుకు కిరాయి ఇంట్లో ఉంటున్నాడు. అనర్హులను జాబితా నుంచి తొలగించి మా లాంటి నిరుపేదలకు ఇళ్లు ఇవ్వాలి.

– గంగవ్వ, చిన్నాపూర్

మరోసారి పరిశీలిస్తాం



గ్రామస్తుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకుంటాం. అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తాం. అవకతవకలకు ఆస్కారం లేదు.

– మాజిద్, తహసీల్దార్, బుగ్గారం

కేటీఆర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ భాస్కర్ తదితరులు

ధర్మపురి: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. అక్టోబర్ 3న ధర్మపురి లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మంత్రి రానున్నందున ఏర్పాట్లను కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ ఎగ్గిడి భాస్కర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. హెలీప్యాడ్, కళాశాల మైదానాన్ని మంత్రి సందర్శించి కలెక్టర్, ఎస్పీలకు దిశానిర్దేశం చేశారు. అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ అరుణ, ఏఎంసీ చైర్మన్ రాజేశ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అంజన్న తెలిపారు. ఇటీవల 9వ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు మెట్‌పల్లిలో జరుగగా, లాంగ్‌జంప్‌లో జుంబర్తి అక్షయ, డిస్కస్‌త్రోలో డి.మధులిక, 10 కి.మీ పరుగుపందెంలో ఎండీ సోహెల్, 3 కి.మీ పరుగుపందెంలో పి.లక్ష్మీప్రసన్న ప్రతిభ కనబర్చారు. ఈనెల 30 నుంచి అక్టోబర్ 1 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు పీఈటీ పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం

జగిత్యాలక్రైం: జిల్లా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగాయని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి వరకు నిమజ్జన ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఏ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సురేశ్, రవీంద్రకుమార్, ఎస్బీ సీఐ నాగేశ్వర్‌రావు, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వినాయక నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్, పోలీస్ అధికారులు

ప్రభుత్వం దిగిరాకుంటే నిరవధిక సమ్మె

జగిత్యాలటౌన్: మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని గ్రామపంచాయతీల కార్మికులు డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు, జీవో 51సవరణతో సమస్యల పరిష్కారం కోరుతూ 34 రోజులు సమ్మె చేయగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి హామీ మేరకు సమ్మె విరమించి 32రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో తిరిగి సమ్మె చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటి చంద్రశేఖర్, పులి మల్లేశం తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం దిగిరాకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జంగిలి ఎల్లయ్య, నేరెల్ల మోహన్, నాతరి మల్లవ్వ, పర్శరాం, రాజన్న, మహేశ్, సంజీవ్, అరుణ్, ప్రభాకర్, వంగ రాజేశం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన జీపీ కార్మికులు

క్లుప్తంగా

జిల్లాకు వర్ష సూచన



జగిత్యాలఅగ్రికల్చర్: రాబోయే ఐదు రోజుల్లో జిల్లాకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 34–35 డిగ్రీల సెల్సియస్‌గా, రాత్రి ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ ఉదయం 73–90 శాతం, మధ్యాహ్నం 53–70 శాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. వాయువ్య దిశ నుంచి గాలులు గంటకు 8–11 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని తెలిపారు.

రాయికల్ ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి



ఠాణా ఎదుట నిరసన తెలుపుతున్న దళితులు

రాయికల్: స్థానిక ఎస్‌ఐ అజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేసి, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అల్లీపూర్ గ్రామానికి చెందిన దళితులు శుక్రవారం ఠాణా ఎదుట నిరసన తెలిపారు. గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి బత్తుల వెంకటేశ్, మరికొందరిపై విచక్షణారహితంగా దాడి చేయడంతోపాటు కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఈ ఘటనలో వెంకటేశ్ మోకాలి చిప్ప పగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్‌ఐపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగరాజు, సాగర్, సురేశ్, వేణు, రమేశ్, బత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం



పెద్దయ్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): అనారోగ్యానికి తోడు.. ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన చంద్రగిరి పెద్దయ్య(52) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డట్లు ఏఎస్సై బాబు శుక్రవారం తెలిపారు. హమాలీ పని చేసుకునే పెద్దయ్యకు అనారోగ్యంతోపాటు ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. వారం రోజులుగా జ్వరం సైతం వస్తోంది. భార్య రాజమ్మ, కుమారుడు గంగరాజు పనిమీద బయటకు వెళ్లారు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో తన తండ్రి పెద్దయ్య ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుమారుడు గంగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాబు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఓ వ్యక్తికి ఐదు రోజుల జైలు, రూ.2000 జరిమానా విధిస్తూ శుక్రవారం కోర్టు తీర్పునిచ్చింది. కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ వివరాల ప్రకారం.. సిటీలో మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురిని ట్రాఫిక్ పోలీసులు జిల్లా మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన బి.సురేశ్‌కు ఐదురోజుల జైలు, రూ.2వేల జరిమానా, మిగితా నలుగురికి రూ.7,000 జరిమానా విధించారు.

పల్లె నుంచి ఢిల్లీకి




- మనసు కవి నలిమెల భాస్కర్
- నాటకాలతో మొదలైన ప్రస్థానం
- పుస్తకాలతో కొనసాగుతున్న బంధం
- 14 భాషల్లో పుస్తకాల అనువాదం
- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో గౌరవం
- తెలంగాణ ఉద్యమంలో ప్రధాన పాత్ర

సాక్షి, కరీంనగర్ డెస్క్: మారుమూల పల్లెలో పుట్టి పెరిగి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. నాటకాలు వేస్తూ ప్రేరణ పొందిన వ్యక్తే.. 14 భాషలపై పట్టు సాధించారు. నందిని సిధారెడ్డి పరిచయంతో సమాజంలో అసమానతలపై రచనల ద్వారా సమాధానం చెప్పారు.. మార్క్సిజం, కమ్యూనిజం పుస్తకాల పఠనంతో తన ప్రపంచాన్ని విశాలం చేసుకున్నారు.. 25 ఏళ్ల వయసులో తన మేన మరదలిని వివాహం చేసుకున్నారు. రచయిత ఎప్పుడూ పసిమనసు కోల్పోవద్దని.. అలా ఆలోచించినప్పుడే సమాజహిత రచనలు చేయగలరని చెబుతుంటారు నలిమెల భాస్కర్. మారుమూల పల్లెటూరు నారాయణపూర్‌లో జన్మించి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకునే వరకు తాను పడిన కష్టాలు.. ఎదురైన సవాళ్లు ఆయన మాటల్లోనే..

బాల్యం.. విద్యాభ్యాసం

నా తల్లిదండ్రులు బుచ్చమ్మ–రామచంద్రం. 1955, ఏప్రిల్ ఒకటిన జన్మించాను. మాది ఇప్పటి రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్. చిన్నతనంలో కరెంట్ లేక ఎక్క దీపం వెలుతురులో చదువుకున్న రోజులు గుర్తున్నాయి. ఐదేళ్ల ప్రాయంలో పాఠశాలకు వెళ్లాను. మా గురువులు చదువు రాని వారిని కఠినంగా శిక్షించే వారు. ఐదో తరగతి తర్వాత ఎల్లారెడ్డిపేటలోని హైస్కూల్‌లో చేరాను. ఆరోతరగతిలోనే పత్రికలు చదివేవాడిని. లక్ష్మీనారాయణ సార్ ప్రోత్సాహంతో ఇంగ్లిష్ పత్రికలు చదవడం అలవాటు పడింది. కృష్ణమాచారి సార్ ప్రోద్బలంతో చరిత్రకారుల పుస్తకాలు చదివాను. నాకు పదేళ్ల ప్రాయంలోనే సాహిత్య పరిచయానికి పుస్తకాలు అనే పోషకాహారం అందింది. మేథో పరిణతి కోసం బీజాక్షరాలు అప్పుడే పడ్డాయి. ఈ ఇద్దరు సార్ల ప్రోత్సాహంతో సాహిత్యం వైపు అడుగులు పడ్డాయి. మా ఇంటి ముందున్న ఎల్.నారాయణ సార్ నేను ఐదో తరగతిలో ఉన్నప్పుడు లవకుశ నాటకం ప్రాక్టీస్ చేయించారు. అయితే మాతో నాటకం ప్రదర్శన వేయించకపోవడంతో మిత్రులం కలిసి సొంతంగా మా ఇంటి ముందే నాటకం ప్రదర్శించాం. దీనికి మా గ్రామస్తుల నుంచి ఆదరణ లభించింది. ఇలా సాంస్కృతిక పరమైన బీజాలు ఇంటి నుంచే పడ్డాయి. ఎల్.నారాయణ సార్ సూచనలతో 9వ తరగతిలో ఉన్నప్పుడు రంగనాయకమ్మ బలిపీఠం పుస్తకం చదివి.. చలించిపోయాను. ఇప్పటికీ ఆ పుస్తకం నా వద్ద ఉంది. అప్పుడప్పుడు ఆ పుస్తకాన్ని చదివి.. నన్ను.. నేను పరీక్షించుకుంటాను. 9వ తరగతిలో చలించినవిధంగానే ఇప్పటికీ స్పందిస్తున్నానా?లేదా? అని పరీక్ష పెట్టుకుంటాను. ఎందుకంటే రచయితకు స్పందించాల్సిన పసిమనసు ఉండాలి. స్పందించే హృదయం లేనప్పుడు ఎన్ని రచనలు చేసినా వృథానే. అటు చదువుతోపాటు అందరి పిల్లల్లాగానే నాకు స్నేహితులు ఉండే వారు. నా బాల్యమిత్రులు ఎలుసాని మల్లయ్య, పూదరి రాజయ్య, మామిండ్ల ముత్తయ్య, నా క్లాస్‌మేట్ మేదరి రాజయ్య, నర్మాల ముత్తయ్య, డి.కిషన్, బి.కిషన్.. ఇలా అందరం కలిసి ఆటలాడుకునేవాళ్లం.



భాస్కర్ రచనలు

9వ తరగతిలోనే మొదటి నవల

తొలి తెలంగాణ ఉద్యమ సమయంలో మా ఊరిలో శ్రీరామచందాదారుల గ్రంథాలయం ఉండేది. సీఎం కేసీఆర్ ప్రధాన సలహాదారులు రమణాచారి తండ్రి అయిన రాఘవచారి పెట్టిన శ్రీరామచందాదారుల గ్రంథాలయానికి వెళ్లి వందలాది డిటెక్టివ్ నవలలు చదివాను. వాటి ప్రభావంతో 9వ తరగతిలోనే 'కాలు కదిపావో కాల్చేస్తా' అనే డిటెక్టివ్ నవల రాశాను. పదో తరగతిలో ఓపాట రాయగా.. అనంతరాయశర్మ అభినందించారు.

కామారెడ్డిలో ఇంటర్.. పుస్తకాలతో దోస్తీ

కామారెడ్డిలోని ఇంటర్మీడియెట్‌లో ప్రవేశించాక నా లోకం విశాలమైంది. అధ్యాపకులు కసిరెడ్డి వెంకటరెడ్డి, గుండి వెంకటాచార్యులు ప్రభావంతో సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. ఫస్టియర్‌లో అనేక గేయాలు, పద్యాలు రాశాను. నిజామాబాద్ నుంచి ఎస్వీఎల్ నరసింహారావు తీసే 'అగ్నివీణ' పత్రికలో నేను రాసిన త్రివర్ణపతాక అనే పద్యం అచ్చు అయ్యింది. ఇలా తొలి పద్యం పత్రికలో అచ్చు కావడంతో నా సంతోషానికి అవధులు లేవు. 1973–74 కాలంలో రాసిన మూడు సాంఘిక నవలలను అచ్చు వేయలేదు. కానీ వాటిని ఇప్పటికీ భద్రంగా దాచి ఉంచాను 1974లో బీఎస్సీ సెకండియర్‌లో 'నా మానవుడా' అనే గేయసంపుటి పుస్తకాన్ని ముద్రించాం. ఆ పుస్తకాన్ని కామారెడ్డి కళాశాలకు అంకితం చేశాను. ఆ పుస్తకంలోని మొదటి గేయం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి అదే సంవత్సరంలో నాలుగుసార్లు ప్రసారమైంది. 1975లో డిగ్రీ పూర్తి చేసిన నేను.. 1976–77లో బీఈడీలో చేరాను. అదే సమయంలో 'భాస్కరోక్తులు' అనే శతకం రాశాను. 1977లో ఆంధ్రభూమిలోని ఆదివారం అనుబంధంలో నేను రాసిన 'మంద' అనే కథ ప్రచురితమైంది. ఆనాటి సమాజంలోని పరిస్థితులపై రాసిన కథ.

కుప్పం వర్సిటీ ఆహ్వానించినా వెళ్లలే..

నందిని సిధారెడ్డి పరిచయంతో నా దృక్పథం మారింది. మార్క్సిజం, నాస్తికత్వం, హేతువాదం పుస్తకాలు చదివాను. 1977–79 మధ్య కామారెడ్డిలోని ప్రాచ్యవిద్యాపరిషత్ ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాలలో టీచర్‌గా పనిచేశాను. అదే సమయంలో కరీంనగర్ డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగం వచ్చింది. తర్వాత మూడేళ్లలో కన్నడం, మళయాళం, తమిళ భాషలు నేర్చుకున్నాను. తెలుగు, కన్నడం, మళయాళం, తమిళ భాషల్లోని సామెతలపై 1983–85 మధ్య ఎంఫిల్ పూర్తి చేశాను. తర్వాత మరో పది భాషలు నేర్చుకున్నాను. అదే సమయంలో ఏపీపీఎస్సీ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాను. మొదటి పోస్టింగ్ భద్రాచలంలో మూడున్నర ఏళ్లు, అక్కడి నుంచి మహబూబాబాద్‌లో రెండున్నరేళ్లు పనిచేశాను. 1990లో పీహెచ్‌డీ పూర్తి చేశాను. 1991లో యూనివర్సిటీలో ఉద్యోగాల కోసం పోస్టులు పడితే దరఖాస్తు చేసుకున్నా..పైరవీలు చేతకాక అక్కడికి వెళ్లలేకపోయాను. ఈ సమయంలో 14 భాషల్లోని 30 పుస్తకాలను తెలుగులోకి అనువదించాను. ఖాళీగా ఉండడం ఏమాత్రం ఇష్టపడని నేను పుస్తకాలు చదవడం, విద్యార్థులకు పాఠాలు బోధించడంలోనే కాలం గడిపేవాడిని. తర్వాత కరీంనగర్‌లోని ఎస్సారార్ కాలేజీకి లెక్చరర్‌గా ప్రమోషన్ వచ్చింది. 2006లో కుప్పం యూనివర్సిటీ నుంచి రవ్వ శ్రీహరి అక్కడికి రమ్మని ఆహ్వానించినా వెళ్లలేదు. 2011లో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. నేను రాసిన పుస్తకాలలో కవిత్వం.. కథలు.. పద్యాలు.. ఇలా తెలుగులోని అన్ని ప్రక్రియలు ఉన్నాయి.

తెలంగాణ ఉద్యమంలో..

- 9వ తరగతి చదివే రోజుల్లో తొలి తెలంగాణ ఉద్యమం ఉగ్రరూపంలో ఉండేది. ఆ సమయంలో ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి 'జై తెలంగాణ' అంటే టిక్కెట్ తీసుకునేవారు కాదు.
- ఆ సమయంలో వేములవాడ సమీపంలోని తిప్పాపూర్‌లో తెలంగాణ ఉద్యమకారులు ఓ సభను పెట్టారు. దానికి పోలీసుల నిర్బంధం ఉండేది. అయినా వేలాది మంది జనం ఆ సభకు తరలివచ్చి, విజయవంతం చేశారు. ఆ సమయంలో నామిత్రులం వెళ్లాం. రాత్రి కావడంతో బస్సులు లేక రాత్రంతా వేములవాడ మూలవాగులోని ఇసుకదిబ్బలపైనే పడుకని తెల్లవారి ఊరికి వచ్చాం.
- మలిదశ ఉద్యమ సమయంలో తెలంగాణ రచయితల వేదిక వ్యవస్థాపకుడు, తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి నన్ను పిలిచి తెలంగాణ మలిదశ ఉద్యమంపై మాట్లాడాలన్నారు. నీళ్ల..నిధులు.. నియామకాలపై ఉన్న వివక్ష పోగొట్టేలా మాట్లాడాను. ఆ సమయంలో తెలంగాణ భాష, యాసపై అన్ని ప్రాంతాల్లో తిరిగి ప్రసంగించాను.
- ఇరవై ఏళ్ల క్రితం 'తెలంగాణ పదకోశం' పుస్తకాన్ని వేశాను. ఇప్పటికీ చాలా సార్లు ముద్రితమైంది.
- తెలంగాణభాష–దేశ్య పదాలను, తెలంగాణభాష అవలోకనం, బాణం.. అని పరిశోధనాత్మక ఉపన్యాసాలు ఇచ్చాను.

పురస్కారాలు

- 2010లో మళయాల నవల 'స్మారకశిలలు' తెలుగులోకి అనువదించాను. దానికి 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.
- అద్దంలో గాంధారి అనే అనువాద పుస్తకాన్ని ఆరు భాషల్లో వేశాను. దానికి 1997లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అనువాద పురస్కారం వచ్చింది.
- బోయి భీమన్న గారి రూ.లక్ష పురస్కారం తెలంగాణ ప్రభుత్వం అందజేసింది.
- ఇంకా అనేకం అవార్డులు.. పురస్కారాలు అందుకున్నాను.

నేరెల్లలో బీట్ ఏర్పాటుకు కృషి చేస్తాం

- డీసీఎమ్మెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

ధర్మపురి: రైతుల సౌకర్యార్థం వద్ద బీట్ ఏర్పాటుకు కృషి చేస్తామని డీసీఎమ్మెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ధర్మపురి మండలంలోని నేరెల్ల గ్రామంలో శుక్రవారం స్థల పరిశీలన చేశారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో నేరెల్లలో బీట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. సహకార సంఘం నుంచి కావాల్సిన నిధులు కేటాయించి, అన్ని వసతులతో నిర్మాణం చేపడుతామన్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శేర్ల రాజేశం, డైరెక్టర్ జాజాల లక్ష్మి, సర్పంచ్ పురంశెట్టి రాజన్న, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డవేణి సత్యం, నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలం



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

ధర్మపురి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆరోపించారు. ధర్మపురిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు అధికారం ఇస్తే దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి, మోసం చేశారన్నారు. దళిత బంధు పథకానిదీ ఇదే పరిస్థితి అన్నారు. దళితులను మరోసారి మోసం చేయాలని చూస్తున్న బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. జిల్లా నాయకులు దొనకొండ నరేశ్, నరెడ్ల శంకర్, ఆకుల శ్రీనివాస్, పల్లెర్ల సురేందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం
- కుటుంబీకుల ఆందోళన



కార్తీక్ (ఫైల్)

వీణవంక(హుజూరాబాద్): కనపర్తికి చెందిన బొంగోని కార్తీక్(22) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బొంగోని తిరుపమ్మ–శ్రీనివాస్‌కు ముగ్గురు కొడుకులు. శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం మృతి చెందగా, తిరుపమ్మ కుటుంబాన్ని పోషిస్తోంది. గ్రామానికి చెందిన ఓ వివాహితతో ఇదే గ్రామానికి చెందిన చిట్టిరెడ్డి కొండాల్‌రెడ్డి, అల్లెపురెడ్డి దేవేందర్‌రెడ్డి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారని కార్తీక్ ప్రచారం చేస్తున్నాడని అనుమానించారు. అయితే సదరు వివాహితతో కార్తీక్‌కే సంబంధం ఉందని కొద్దిరోజులుగా ఆ యువకుడిని దేవేందర్‌రెడ్డి, కొండాల్‌రెడ్డి వేధిస్తున్నారు. నిత్యం తమ ఇళ్లకు పిలిపించుకుని బెదిరించి, దాడి చేశారని అతడి కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో మనస్తాపం చెందిన కార్తీక్ ఈనెల 28న పురుగుల మందు తాగాడు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు సతీశ్ ఫిర్యాదు మేరకు దేవేందర్‌రెడ్డి, కొండాల్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆసిఫ్ తెలిపారు.

చెల్లితో వీడియో కాల్ : కార్తీక్ పురుగుల మందు తాగే ముందు తన చిన్నమ్మ కూతురుతో వీడియో కాల్ మాట్లాడాడు. తనకు జరిగిన అవమానాన్ని చెబుతూ కన్నీటిపర్యంతమయ్యాడు. ఆ వీడియో చూసిన గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు. కార్తీక్ చావుకు కారణమైన దేవేందర్‌రెడ్డి, కొండాల్‌రెడ్డిని అరెస్టు చేయాలని జమ్మికుంటలో బాధిత కుటుంబసభ్యులు ధర్నాకు దిగారు. కేసు విషయంలో వీణవంక ఎస్సై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.

వినాయక నిమజ్జనంలో కత్తిపోట్లు

- ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న రాజు

జగిత్యాల క్రైం: వినాయక నిమజ్జనంలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన శంబు రాజు గురువారం రాత్రి వినాయక నిమజ్జనంలో డాన్స్ చేస్తున్నాడు. ఆ సమయంలో ఇదే ప్రాంతానికి చెందిన పూరెల్ల మల్లికార్జున్‌కు అతనికి మధ్య గొడవ జరిగింది. దీంతో మల్లికార్జున్ కత్తితో రాజు పొట్టలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ సీఐ నాగేశ్వర్‌రావు ఆస్పత్రికి వెళ్లి, రాజు ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు.

గణేశ్ నిమజ్జనంలో గొడవపడిన ఇద్దరిపై కేసు

మల్యాల: గణేశ్ నిమజ్జనం సందర్భంగా జరిగిన గొడవలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి మల్యాలలో నిర్వహించిన వినాయక విగ్రహ ఊరేగింపులో స్థానికుడు నాగుల జగదీశ్వర్, జగిత్యాల మండలంలోని దరూర్‌కు చెందిన తిరుమల హృషికేశ్ గొడవ పడ్డారు. శుక్రవారం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కెనాల్లో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

- గల్లంతయిన బాధితురాలు

మేడిపెల్లి: మండల కేంద్రానికి చెందిన కొడ మేఘన కుటుంబ కలహాలతో కలత చెంది, శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసిందని స్థానికులు తెలిపారు. స్థానిక కాకతీయ కెనాల్‌లో దూకగా గల్లంతయినట్లు పేర్కొన్నారు. భర్త రంజిత్ జీవనోపాధి నిమిత్తం దుబాయి వెళ్లగా, ఆమె తన ఇద్దరు పిల్లలతో ఉంటున్నట్లు తెలిపారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

- ఎంపీ అర్వింద్



రఘుకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే ఈటల

మెట్‌పల్లి(కోరుట్ల): నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ అర్వింద్ సూచించారు. మెట్‌పల్లికి చెందిన ప్రముఖ వైద్యుడు చిట్నేని రఘు ఎంపీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ స్థానంలో గెలుపొందామని, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని 7 స్థానాల్లోనూ బీజేపీ గెలిచే అవకాశముందన్నారు. రాబోయే రోజుల్లో పలు పార్టీలకు చెందిన ముఖ్యమైన నేతలు బీజేపీలో చేరుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ, నాయకులు చెట్లపల్లి సుఖేందర్, ఆకుల లింగారెడ్డి, ఏలేటి నరేందర్‌రెడ్డి, బొడ్ల రమేశ్, చింతల శ్రీకర్‌గౌడ్ తదితరులున్నారు.

హెల్త్ కార్డులు నిరుపేదలకు వరం

- మంత్రి కొప్పుల ఈశ్వర్



హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: నిరుపేదల సౌకర్యార్థం అందిస్తున్న హెల్త్ కార్డులు వరంలాంటివని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో శుక్రవారం ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదరికంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులకు హెల్త్ కార్డులు అందించాలని సంకల్పించామని, ఈ సందర్భంగా ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ ద్వారా సొంత ఖర్చులతో 1,800 మందికి కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కరీంనగర్, హైదరాబాద్ లాంటి 48 కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు ఈ కార్డులు ఉపయోగపడుతాయని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన భాగవతా సప్తాహం

ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భాద్రపదం సందర్భంగా ఈనెల 22 నుంచి ప్రారంభమైన భాగవతా సప్తాహం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మంత్రి హాజరై విశ్వనాథశాస్త్రిని సన్మానించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ అరుణ, రెనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

చొప్పదండి: పట్టణంలోని వేబ్రిడ్జి సమీపంలోని ప్రధానరోడ్డుపై జరిగిన ప్రమాదంలో గాయపడ్డ బీనవేని రాజు(47) చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం రామడుగు మండలం దత్తోజిపేటకు చెందిన రాజు 20ఏళ్లుగా చొప్పదండిలో వెల్డింగ్‌షాపు నిర్వహిస్తున్నాడు. దత్తోజిపల్లి నుంచి ప్రతిరోజు వెల్డింగ్ షాపునకు బైక్‌పై రాకపోకలు సాగిస్తున్నాడు. గురువారం రాత్రి షాపుమూసి స్వగ్రామానికి వెళ్తుండగా చొప్పదండిలోని ప్రధాన రోడ్డుపై వేబ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు నగునూరులోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంటలోని ఓ బ్యాంకు ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మికుంటలోని యూనియన్ బ్యాంకు పక్కన ఉన్న ఏటీఎంను గుర్తుతెలియని వ్యక్తులు ఎలక్ట్రిక్ కట్టర్‌తో ధ్వంసం చేశారు. ఓపెన్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐ రమేశ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఏటీఎంను ఓపెన్‌చేసి నగదు చోరీ కాలేదని నిర్ధారించారు. సీసీ పుటేజీ ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.